ప్రజలందరికీ ఆరోగ్య భద్రత



సీతానగరం: ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణ మహేష్ రెడ్డి, ప్రజాప్రతినిధులు



బలిజిపేట: పెదపెంకిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

సీతానగరం:

జగనన్న ప్రభుత్వం ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి వైద్య నిపుణులతో మెరుగైన వైద్య సేవలుఅందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి. శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ అన్నారు. ఈ మేరకు మండలంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీపురంలో పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ ఆధ్వర్యంలో వైద్యనిపుణులతో ఉచితవైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై డాక్టర్లు, రోగులను అడిగి తెలుసుకున్నారు. అందరికీ ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్య పరీక్షలతో పాటు మందులు అందజేయనుందని, ఇక్కడ నయం కాని పెద్ద అనారోగ్య సమస్యలకు పెద్దాస్పత్రులకు రిఫర్‌చేసి ఎంత ఖర్చయినా సరే పూర్తిగా ప్రభుత్వమే భరించి ఉచిత వైద్యం అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి, ఏగోటివలస, లక్ష్మీపురం సర్పంచ్‌లు యు. రాధాకృష్ణ, టి.సత్యవతి, ఎంపీటీసీ టి.పార్వతి, సచివాలయ కన్వీనరు సీహెచ్ సురేష్‌కుమార్, ఎంఈఓ జి.సూరిదేముడు, సచివాలయ ఉద్యోగులు, పెదంకలాం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, పలుగ్రామాల ఆశవర్కర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు, వివిధ ప్రాంతానుంచి ప్రత్యేక వైద్య నిపుణులు, సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, వై.గోపాలనాయుడు, వలంటీర్లు పాల్గొన్నారు.

593మందికి వైద్యసేవలు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 593మందికి వైద్యసేవలు అందించారని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ర్యక్రమంలో వైద్య బృందం పాల్గొని అన్నిరకాల వైద్యసేవలు అందించారన్నారు. మొత్తం 593మందికి వైద్యసేవలు అందించగా అవసరమైన వారిని రిఫరల్ చేసినట్లు తెలిపారు. వైద్యసేవలు పొందేవారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. వలంటీర్లు, వైద్యశాఖ ఇంటింటి సర్వే చేసి ఇచ్చిన టోకెన్ల ప్రకారం వచ్చినవారికి సేవలు అందించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు ప్రత్యేక వైద్యసేవలు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు కిరణ్మయి, జి.శశిధర్, సర్పంచ్ పాపారావు, ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, పలువురు నాయకులు, వైద్యసిబ్బంది, వైద్యసేవలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోర్లకు శంకుస్థాపన



టెంకాయ కొట్టిన ఎంపీపీ నాగమణి

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో గ్రామస్తుల నీటిఎద్దడి నివారణకు ఎమ్మెల్యే జోగారావు చొరవతో రూ.4.80లక్షలతో 4బోర్ల నిర్మాణానికి ఎంపీపీ నాగమణి మంగళవారం టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా నీటిఎద్దడిని నివారించాలని గ్రామస్తులు కోరడంతో ఎమ్మెల్యే జోగారావు ఆదేశాల మేరకు ఈ పనులు చేపట్టినట్లు ఎంపీపీ నాగమణి తెలిపారు. కొండవీధి, యాదవవీధి, కూరాకుల వీధి, 1వ నంబర్ పాఠశాల సమీపంలో బోర్లను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపారావు, జి.శ్రీనివాసరావు, జగన్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సప్తధాన్య అంకుర కషాయం తయారీ



మిర్తివలసలో తయారుచేస్తున్న ద్రావణం

బలిజిపేట: మండలంలోని మిర్తివలస గ్రామంలో సప్తధాన్య అంకుర కషాయం తయారీపై రైతులకు ఎంసీఆర్‌పీ లక్ష్మి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ ద్రావణం తయారీకి 7రకాల గింజలు, పెసలు, మినుములు, కందులు వంటివి 100గ్రాముల వంతున తీసుకుని 12గంటలు నానబెట్టి తర్వాత గుడ్డలో మూటకట్టి మొలకలు వచ్చిన తరువాత మెత్తగా పేస్ట్ చేసి 200లీటర్ల గోమూత్రం కలిపి 24గంటలు పులియబెట్టాలని తెలిపారు. దీనిని వరిచేనుకు కొట్టడం వల్ల గింజ బరువుతో పాటు రంగునాణ్యత పెరుగుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వీటిని తయారుచేసుకోవడం ఎంతో మంచిదని చెప్పారు. రైతులు వీటిపై దృష్టిసారిస్తే వ్యయం తగ్గి, అధిక దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

13న వీరఘట్టంలో 'జగనన్నకు చెబుదాం'

వీరఘట్టం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13న ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి చక్కని వేదికగా ఉన్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

భామిని: భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై మరింత పట్టు సాధించడానికి వీలుగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, ఇంగ్లిష్ టీచర్ ఆధ్వర్యంలో ఆంగ్లంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమంగా రాసిన విద్యార్థులను ప్రశంసించారు.

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చర్యలు

సీతంపేట: ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి తెలిపారు. స్థానిక ఐటీడీఏలో రాజకీయ పార్టీ నాయకులు, అధికారులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితా తప్పులు లేకుండా తయారు చేస్తున్నామని ఎటువంటి తప్పులున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఓటరు జాబితాలో ఉన్నట్టు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కషాయాల తయారీ గూర్చి వివరిస్తున్న యాంకర్ నరేష్

సీతంపేట: మండలంలోని కుసింగి గ్రామ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. మండల యాంకర్ నరేష్ ఆధ్వర్యంలో తక్కువ పెట్టుబడులతో ఎలా వ్యవసాయం చేసుకోవాలో వివరించారు. వరి పంటకు పొటాషియం అవసరం కాబట్టి రైతులతో జిల్లేడు ఆకులతో ద్రావణం తయారీ చేసే విధానం గూర్చి తెలియజేశారు. కార్యక్రమంలో కుశిమి యూనిట్ ఐసీఆర్‌పీఎస్‌లు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం



మాట్లాడుతున్న ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: పేదరిక నిర్మూలనకు క్షేత్రస్థాయి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయడానికి మండలంలోని వివిధ శాఖల వారీగా ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి దీపిక తయారు చేయడానికి ముందుగా 2023 మార్చి నెల నుంచి జరిగిన అభివృద్ధిని, భవిష్యత్‌లో చేపట్టవలసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సర్వే చేసి 639 ఇండికేటర్స్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని ఆయాశాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రభుత్వం 2030 ఆర్థిక సంవత్సరం నాటికి పేదరిక నిర్మూలనకు అవసరమైన ప్రణాళికలు గ్రామ పంచాయతీ నుంచి తయారు చేయడానికి అవసరమైన అవగాహన సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి సాటిలేదు



వెంగాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ సామల, సహ ఉపాధ్యాయులు

బలిజిపేట: ఉపాధ్యాయ వృత్తికి ఏదీ సాటిరాదని ఎంఈఓ-1 సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు మండలంలోని వెంగాపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల పదోన్నతి పొంది, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కేఎస్ఎన్.మూర్తి, ఐ.సత్యనారాయణలను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ సామల సింహాచలం మాట్లాడుతూ సమాజంలో మంచి గుర్తింపు లభించేది ఉపాధ్యాయ వృత్తికేనన్నారు. ఉపాధ్యాయులు వారి చేతుల మీదుగా ఎంతో మంది భవిష్యత్‌ను తీర్చిదిద్దుతారన్నారు. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుడికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. మంచి ఉపాధ్యాయుడు పదోన్నతి పొందినా, ఉద్యోగ విరమణ చేసినా పేరు, ప్రఖ్యాతులు చిరకాలం గుర్తుండిపోతాయన్నారు. సన్మాన గ్రహీతలు భవిష్యత్తులో మంచి పేరు ప్రతిష్ఠలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పకీరునాయుడు, చిలకలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్, సహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా గోవిందరావు



అధ్యక్షుడిగా ఎన్నికైన గోవిందరావుకు అభినందనలు తెలుపుతున్న సహచర పాత్రికేయులు

పాచిపెంట: స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా నల్లి గోవిందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సీనియర్ పాత్రికేయుడు దండి కొండలరావు అధ్యక్షతన ఎన్నిక నిర్వహించగా ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా గోవిందరావు ఉపాధ్యక్షుడిగా చిట్టూరి రమణమూర్తి కార్యదర్శిగా యజ్జీపరుపు గౌరీశ్వరరావు కోశాధికారిగా పాచిపెంట ఉమామహేశ్వరరావు సంయుక్త కార్యదర్శిగా పడాల వెంకటరమణతో పాటు మరో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో విజేతలకు తోటి విలేకరులు అభినందనలు తెలిపారు. ప్రెస్‌క్లబ్ బలోపేతానికి, పత్రికా విలేకరుల సమస్యల పరిష్కారానికి తనవంతు కషి చేస్తానని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గోవిందరావు ఈ సందర్భంగా తెలిపారు.

ఏజెన్సీలకు వంట పాత్రలు



ఎంఆర్‌సీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వంట పాత్రల ప్యాకింగ్‌లు

భామిని: మండలంలోని 62 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీలకు వంట పాత్రలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఎంఆర్‌సీకి వీటికి సంబంధించిన కిట్లు వచ్చాయి. వీటి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంఈఓ వి.భాస్కరరావు మంగళవారం తెలిపారు. ఎంఆర్‌సీ ద్వారా ఎండీఎం ఏజెన్సీలకు సమాచారం అందించామని, త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు.

నేడు రోడ్డు పనులకు శంకుస్థాపన

కొమరాడ: మండలంలోని డంగభద్ర-కుమ్మరిగుంట రోడ్డు పనులతో పాటు దేవునిగుంప బీటీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఈ కార్యక్రమానికి హాజరై, భూమిపూజ చేసి, పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టనున్నారన్నారని పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

పంటల సాగుపై జాగ్రత్తలు పాటించాలి



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఏఓలు

సీతానగరం: పంటలపై ఆశించిన తెగులు నివారణకు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ పంట సాగుపై రైతులనుంచి వారి అనుభవాలను తెలుకుంటున్నామని ట్రైనీ ఏఓలు అన్నారు. ఈ మేరకు ఒడిశాలోని పర్లాకిమిడి ఎంఎస్ స్వామినాథన్ స్కూల్‌ఆఫ్ అగ్రికల్చర్ టెక్నాలజీస్ ట్రైనీ ఏఓలు సీహెచ్ అనిత, ఆర్ స్పందన, ఆర్.గ్రీవన్య రైతులతో సీతానగర మండలంలోని పెదభోగిలిలో మంగళవారం వ్యవసాయ ప్రదర్శన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి తమవంతు కృషి చేస్తున్నామని, అలాగే రైతులకు ఖరీఫ్ వరిపంట సాగు చేస్తున్న వారికి వరిలో ఆశించే తెగుళ్ల, నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. తాజాగా వరిలో అగ్గితెగులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎల్లోస్టిక్స్ టాప్స్ వినియోగంపై వివరించామని తెలియజేశారు. కార్యక్రమంలో వరిసాగు, చెరకు రైతులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దిశ డీఎస్పీ హర్షిత

• డీఎస్పీ హర్షిత

పార్వతీపురంటౌన్: దిశ యాప్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని దిశ సెల్ డీఎస్పీ హర్షిత అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని శ్రీ కృష్ణ పబ్లిక్ స్కూల్‌లో దిశ యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు దిశ ఎస్ఓఎస్ యాప్ ఉపయోగపడే విధానాన్ని స్వయంగా ఆమె వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళ తన రక్షణకు తప్పనిసరిగా ఆమె స్మార్ట్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.
మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ఈ యాప్ వల్ల అరికట్టవచ్చునన్నారు. విద్యార్థులంతా వారి తల్లిదండ్రుల మొబైల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది దిశ ఎస్సై లావణ్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ

వంగర: అత్యవసర సమయాల్లో దిశ యాప్ ఉపయోగిస్తే మహిళలకు రక్షణ కలుగుతుందని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన రికార్డులు నిర్వహణ, పెండింగ్ కేసులు, ఫిర్యాదులు వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దిశ యాప్‌పై గ్రామాల్లో, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. మద్యం, సారా విక్రయాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

పౌష్టికాహార విశిష్టతను గర్భిణులకు వివరించాలి



మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సీతానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాల్లో మండలంలోని అంగన్వాడీ కేంద్రాలద్వారా ఏర్పాటు చేస్తున్న పౌష్టికాహార వస్తువుల గురించి, వాటి విశిష్టత గురించి గర్భిణులు, బాలింతలకు తెలియజేయాలని ఏపీటిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఐసీడీఎస్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన లక్ష్మీపురంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజలందరికీ ఆరోగ్యభద్రత కల్పించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేసిందని, ప్రజలంతా వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ

పాలకొండ: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని ఎంఈఓ కృష్ణమూర్తి ఉపాధ్యాయులకు సూచించారు. ఇటీవల వరల్డ్ స్పేస్ వీక్ సెలెబ్రేషన్స్‌లో భాగంగా సతీష్ దావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట ఆధ్వర్యంలో విశాఖపట్నం రఘు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జోన్ స్థాయి పోటీల్లో పాలకొండకు చెందిన విద్యార్థులు పాల్గొని పలు బహుమతులు పొందారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని వెంకమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాణించాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లేడు కషాయం తయారీపై అవగాహన



జిల్లేడు కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కో-ఆర్డినేటర్ అన్నపూర్ణ

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. తొలుత 100 లీటర్ల నీటిలో 20 కిలోల జిల్లేడు ఆకులు, 20 లీటర్ల గోవుమూత్రం వేసి, 48 గంటల పాటు మరగనివ్వాలి. ఆ తర్వాత తయారైన కషాయాన్ని పత్తి, అరటి, వరి, పంటల్లో పిచికారీ చేస్తే చీడపీడలు, తెగుళ్ల బారినపడకుండా పంటలు ఉంటాయన్నారు. అలాగే అధిక దిగుబడి, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందన్నారు. కార్యక్రమంలో జట్టు ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మండ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్స్ తొలగిస్తున్న ఎస్‌ఐ షన్ముఖరావు

గుమ్మలక్ష్మీపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని ఎల్విన్‌పేట ఎస్‌ఐ ఎస్.షన్ముఖరావు అన్నారు. మంగళవారం ఎల్విన్‌పేట నుంచి మండ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు(జంగిల్స్)ను జేసీబీ సహాయంతో తొలగించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా పెరిగి ఉన్న ఈ తుప్పలతో వాహనదారులకు ఎదురుగా వస్తున్న వాహనదారులు కనబడకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. వాహనాలతో రోడ్డుపైకి వచ్చేటప్పుడు ప్రతీ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూనే వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఎస్‌జీటీలకు వృత్యంతర శిక్షణ

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎస్‌జీటీ, ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయులకు మంగళవారం వృత్యంతర శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో పక్కాగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, సీఎంఓ చిరంజీవి, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉత్సవాలకు అనుమతివ్వండి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల(దసరా ఉత్సవాలు) నిర్వహణకు అనుమతి ఇవ్వాలని సర్పంచ్ బి.గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, గ్రామపెద్దలు కోరారు. ఇదే విషయమై ఎల్విన్‌పేట ఎస్‌ఐ షన్ముఖరావును మంగళవారం కలిసి, వినతి పత్రం అందజేశారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు జరుపుకునేందుకు నిర్ణయించుకోవడం జరిగిందని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాము చూసుకుంటామని, దీనికి మీరు కూడా సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కిశోర్‌కుమార్, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్, వైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్ పాల్గొన్నారు.